సేవాలాల్ ఆశయ సాధనకు కృషి

■ ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా : సేవాలాల్ మహారాజ్ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, ఫిబ్రవరి 18 : సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. భైంసాలో సంత్ సేవలాల్ చౌక్ వద్ద జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. సేవాలాల్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి హోమంలో పాల్గొన్నారు. ముథోల్ నియోజకవర్గంలో బంజారాలకు తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. బంజారా సంఘం నాయకులతో పాటు బీజేపీ నాయకులు అభినవ సర్దార్, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు సోలంకి భీంరావు, తాలోడ్ శ్రీనివాస్, ఎనుపోతుల మల్లేశ్, గాలి రవి, బాలాజీ సూత్రావే పాల్గొన్నారు.

గోశాల షెడ్డు నిర్మాణం ప్రారంభం

భైంసా, ఫిబ్రవరి 18 : భైంసాలోని గోశాల షెడ్డును నూతన కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోశాలకు తన వంతు సహాయ సహకారం అందిస్తానన్నారు. గోశాల భూదాత చిన్నయ్, నాగనాథ్ పాటిల్, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, తూమోళ్ల దత్తాత్రి, హిందూ వాహిని పట్టణ అధ్యక్షుడు ఆకుల రంజిత్, పట్టణ సీఐ రాజా రెడ్డి, అభినవ్ సర్దార్, సుదర్శన్ పటేల్, నిమ్మల ప్రవీణ్, కార్యదర్శి సిందే లక్ష్మణ్, నంగి దత్తు పాల్గొన్నారు.

పోచమ్మతల్లికి చలిబోనాలు

ఖానాపూర్, ఫిబ్రవరి 18: పట్టణంలోని పలు కాలనీల మహిళలు భక్తి శ్రద్ధలతో పోచమ్మ తల్లికి ఆదివారం చలి బోనాలు సమర్పించారు. ఆముదపు చెట్ల ఆకుల్లో వండిన బోనాలు, పుట్నాలు, బెల్లం, పెరుగు, ఓమతో పాటు నైవేద్యాన్ని సమర్పించారు. తమ కుటుంబాలకు ఏలాంటి ఆపదవాటిళ్లకుండా సుఖ సంతోషాలతో ఉంచాలని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరాంనగర్, గాంధీనగర్, శాంతినగర్, సాయినగర్ కాలనీల మహిళలు పాల్గొన్నారు.

ఖానాపూర్ : పోచమ్మ ఆలయం వద్ద నైవేద్యాలు సమర్పిస్తున్న మహిళలు

ఖానాపూర్ మండలంలో..

ఖానాపూర్ రూరల్, ఫిబ్రవరి 18 : ఖానాపూర్‌తోపాటు పలు గ్రామాల్లో పోశమ్మ తల్లికి చలిబోనాలను మహిళలు సమర్పించారు. బోనాలతో మహిళలు కుటుంబ సమేతంగా వచ్చి పూజలు చేశారు.

దస్తురాబాద్‌లో..

దస్తురాబాద్, ఫిబ్రవరి 18 : పలు గ్రామాల్లో పోచమ్మ తల్లులకు ఆదివారం మహిళలు చలి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు ఉదయమే బోనాలతో పోచమ్మ ఆలయాలకు చేరుకొని బోనాలను సమర్పించి, ప్రత్యేక పూజలను చేసి మొక్కలను తీర్చుకున్నారు. ఒక్క రోజు ముందుగానే కుండాలను కొనుగోలు చేసి ఆ కుండల్లో రాత్రి భక్తి శ్రద్ధలతో బోనాలను తయారు చేసి మరుసటి రోజు ఉదయం పోచమ్మ తల్లులకు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తున్నదని మహిళలు తెలిపారు. మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దస్తురాబాద్ : బోనాలతో మహిళలు

వైభవంగా రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవం

దస్తురాబాద్, ఫిబ్రవరి 18 : మున్యాల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి రేణుక ఎల్లమ్మ 5వ వార్షికోత్సవం వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకొని పోచమ్మ ఆలయానికి చేరుకొని బోనాలను సమర్పించారు. రెండు రోజుల క్రితం గంగస్నానం, జోగు తిరగడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. దాత నాగు స్వామి, గౌడ సంఘం పెద్దలు, రాజు, కిరణ్, శ్రీనివాస్, సాగర్, శ్రీకాంత్, మధు, శంకర్ గౌడ్, మహిళలు, తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్ : ఆలయానికి గంగానీళ్లను తీసుకొస్తున్న భక్తులు

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

- డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ అర్బన్/కుభీర్, ఫిబ్రవరి 18 : విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు నిర్మల్ డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. కుభీర్ మండలం పల్సి ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సాగర్‌ను సస్పెండ్ చేశారు. పాఠశాల విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణల ఆధారంగా జిల్లా సంక్షేమ అధికారి, ఎంఈవోలు విచారణ చేపట్టారు. వారి నివేదికల ఆధారంగా శనివారం సస్పెన్షన్ విధించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ప్రధానోపాధ్యాయుడు సురేశ్‌కు షోకాజ్ నోటీసులు అందించి తదుపరి చర్యల కోసం ఆర్జేడీకి నివేదించినట్లు డీఈవో తెలిపారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 18 : ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, ఎంఈసీ చదువుతున్న విద్యార్థులకు హెచ్‌సీఎల్-టెక్ బీ ఆధ్వర్యంలో ఈ నెల 22న ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి పరశురాం తెలిపారు.సాఫ్ట్ వేర్ రంగంలోని జాబ్ కోసం ఎంపీసీ, ఎంఈసీలో 75 శాతం మార్కులు, గణితంలో 60 శాతం మార్కులు పొందిన అభ్యర్థులు అర్హులని ధ్రువీకరణ పత్రాలు, ఆన్‌రైడ్ ఫోన్‌తో జాబ్ మేళాకు హాజరుకావాలని. వివరాలకు 9493553821, 8074065803 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 18 : నిర్మల్ లో ప్రజలందరూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో పాటు గతంలో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను, నల్లబిల్లు, దుకాణ సముదాయ పన్ను మార్చి 31వ తేదీలోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు తెలిపారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో గానీ ఇంటి వద్దకు, కార్యాలయానికి వచ్చే బిల్ కలెక్టర్‌కు గానీ చెల్లించాలని పేర్కొన్నారు.

ఎస్ఐకి సన్మానం

దిలావర్‌పూర్ ఫిబ్రవరి 18 : దిలావర్‌పూర్ ఎస్ఐగా నూతన భాద్యతలు చెపట్టిన సుమాంజలిని ఆదివారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు కలిసి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు. నాయకులు తక్కల సాగర్‌రెడ్డి, అర్గుల రమణ, రాజారెడ్డి, శ్రీహరి, యుసూఫ్, సాయన్న తదితరులున్నారు.

భోజన శాలలో కొనసాగుతున్న పనులు

భోజన శాల పనులు ప్రారంభం

■ నమస్తే కథనానికి స్పందన

దస్తురాబాద్, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భోజన శాల నిర్మాణం కోసం గిరిజన శాఖ ఐటీడీఏ ద్వారా రూ. 30 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు ప్రారంభించి దాదాపు 2 సంవత్సరాలు అయినా ఇంకా పనులు పూర్తి కాలేదు. ఈ నెల 5న నమస్తే తెలంగాణలో నత్తనడకన భవన పనులు అనే కథనం ప్రచురితమైంది. దీంతో కాంట్రాక్టర్ ఐదు రోజుల క్రితం పనులు ప్రారంభించారు. కాగా కరెంట్, వ్యాండ్ వాష్‌కు నల్లాలు బిగింపు పనులు సాగు తున్నాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నల్లాలు ఏర్పాటు కోసం కొనసాగుతున్న పనులు

రేపు డ్రామా పోటీలు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 18 : ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉమ్మడి జిల్లా డ్రామా పోటీలను నిర్మల్‌లో జరుగుతాయని డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి (నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్) పోటీలు నిర్మల్‌లోని అర్బన్ కేజీబీవీ పాఠశాలలో జరుగుతాయని, ఇందులో గెలుపొందిన వారు ఈనెల 26న రాష్ట్ర స్థాయిలోజరిగే పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీలకు హాజరుకావాలని కోరుతూ ఆదివారం డీఈవో రవీందర్ రెడ్డికి ప్రతినిధులు ఆహ్వాన పత్రాన్ని అందించారు.

భక్తుల సందడి

కుంటాల, ఫిబ్రవరి 18 : మండల కేంద్రంలోని గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. అమ్మవారి ఆలయంలో పూజారులు గజేందర్, నగేశ్ ఆధ్వర్యంలో అలంకరణ, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంటాలకు చెందిన గాజుల భూమన్న - సుమాలిని దంపతులు మూడు గ్రాముల బంగారాన్ని అమ్మవారికి ముక్కుపుడక అందజేశారు. ఈ నెల 21 నుంచి వార్షికోత్సవ వేడుకలు జరుగనున్న నేపథ్యంలో ఏర్పాట్లు చురుగాకగ సాగుతున్నాయి. కార్యక్రమంలో తాటి శివ, బొంతల పోశెట్టి, సక్రపు గజేందర్, చిప్ప సంజీవ్, శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పలువురి అరెస్టు

కుభీర్, ఫిబ్రవరి 18 : ఈ నెల 15న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన శోభయాత్రలో చవాన్ అవినాశ్ అనే యువకుడిపై ఒక వర్గానికి చెందిన వారు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. విచారణ జరిపిన పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం నలుగురిపై కేసు నమోదు చేశారు. కాగా ఆదివారం వారిని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఎండీ షరీఫ్ తెలిపారు. ఇంకా విచారణ కొనసాగుతున్నదని, దాడికి కారకులైన వారిపై కేసులు నమోదు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

భైంసా, ఫిబ్రవరి 18 : భైంసాలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్ర మంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు భైంసా టౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పజెప్పామన్నారు.

రైతు విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

రైతు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

ఖానాపూర్, ఫిబ్రవరి 18 : ఖానాపూర్-నిర్మల్ జాతీయ రహదారిపై రైతు విగ్రహ ఏర్పాటుకు ఆదివారం మున్నూరుకాపు సంఘం నాయకులు భూమి పూజ చేశారు. ఎమ్మెల్సీ దండే విఠల్ సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం సభ్యులు పేర్కొన్నారు. రైతు బాంధవుడు మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో రైతులకు రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంట్, సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించారని వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కడుకుంట్ల రవి, నిమ్మల రమేశ్, నాగరాజు, రవి, ప్రదీప్, రాజేశ్వర్, శ్రీను, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జయంతిని జయప్రదం చేయండి

భైంసా, ఫిబ్రవరి 18 : బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని జయప్రదం చేయాలని ఆలిండియా బంజారా సేవా సమితి, ఉత్సవ కమిటీ జిల్లా బాధ్యులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం భైంసాలోని సంత్‌సేవాలాల్ చౌక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు రాథోడ్ తుకారాం మాట్లాడుతూ ఈ నెల 21న మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా కేంద్రంలోని దివ్య నగర్‌లో గల జగదాంబ మందిరంలో సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్కతో పాటు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని తండాల నుంచి లంబాడీ గిరిజనులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్ బాబు, ఉత్సవ కమిటీ సభ్యులు లంబాడా జేఏసీ నాయకులు గోవింద్ నాయక్, అశోక్ నాయక్, రాజేందర్ రాథోడ్, బంజారా సంఘం భైంసా నాయకులు నాజం సింగ్, గులాబ్ సింగ్, బలిరాం, తదితరులు ఉన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బంజారా సేవా సమితి నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు

గంగస్నానానికి భీమన్న గజాలు

లక్ష్మణచాంద : వడ్యాల్‌లో గంగస్నానానికి తీసుకెళ్తున్న భీమన్న గజాలు

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 18 : వడ్యాల్ గ్రామంలోని భీమన్న దేవుని గజాలను ఆదివారం గంగస్నానానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా భీమన్న గజాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. భీమన్న గజాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోదావరి నదికి తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం భీమన్న గజాలను ఆలయంలో పునః ప్రతిష్ఠించడంతో జాతర ప్రారంభమైందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ద్యావెరపు మల్లన్న పట్నాలు

దస్తురాబాద్, ఫిబ్రవరి 18 : మండలంలోని గొడిసెర్యాల గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా ద్యావెరపు మల్లన్న పట్నాలు వైభవంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని గోదావరికి వెళ్లి ఊరేగింపుగా దేవుళ్లను తీసుకెళ్లి, గంగా స్నానం ఆచరించారు. ర్యాలీగా మల్లన్న స్వామి ఆలయానికి చేరుకున్నారు. సుంకు బియ్యం, పుట్టబంగారం,తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

గరిష్ట ఉష్ణోగ్రత నిర్మల్‌లోనే..

నిర్మానుషంగా జాతీయ రహదారి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 18 : రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఏప్రిల్, మే నెలలో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతలు ఫిబ్రవరిలోనే నమోదవుతుండడంలో బయటకు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. ఆదివారం రాష్ట్రంలో నిర్మల్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిర్మల్ జిల్లాలోని దస్తురాబాద్ మండలంలో 38.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాలలో 38.5, కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో 38.0, ఆదిలాబాద్ జిల్లాలో 37.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రత మాత్రం 13.6 డిగ్రీలు మాత్రమే నమోదైంది.

ఘనంగా సేవాలాల్ జయంతి

సేవాలాల్ మహారాజ్ చిత్రటం వద్ద పూజలు చేస్తున్న బంజారా సేవా సమితి సభ్యులు

భైంసా, ఫిబ్రవరి 18 : భైంసాలోని బంజారాల ఆధ్వర్యంలో సేవాలాల్ చౌక్‌లో ఆదివారం సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు చేసి ప్రసాదం పంచిపెట్టారు. అనంతరం అభినవ్ సర్దార్ మాట్లాడుతూ సేవాలాల్‌ని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఇందులో బంజారా సేవాలాల్ సమితి అధ్యక్షుడు నాజం సింగ్, గబ్బర్‌సింగ్, బలరాం, బాలాజీ సూత్రావే, తదితరులు ఉన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లింబాద్రి

ఖానాపూర్ టౌన్, ఫిబ్రవరి 18 : చిన్నతనం నుంచే ఆడపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై తల్లి అవగాహన కల్పించాలని ఖానాపూర్ ఎస్ఐ లింబాద్రి పేర్కొన్నారు. ఆదివారం మహాత్మా జ్యోతి బాపూలే బాలికల గురుకుల కళాశాలలో విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అకతాయిలు వేధిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆపదలో ఉన్నప్పు డు 100 లేదా 1930కు కాల్ చేయాలని తెలిపారు.

20న చలో సెక్రటేరియట్

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 18 : ఈనెల 20న దూపదీప నైవేద్య అర్చకుల సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు యోగేశ్ కుమార్ శర్మ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ ఆదేశాల మేరకు దూపదీప అర్చకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

మద్యానికి బానిసై..

లోకేశ్వరం, ఫిబ్రవరి 18 : మండలంలోని కనకాపూర్ గ్రామానికి చెందిన సుక్కనూరు సుక్కన్న (55) అనే వ్యక్తి మూడు నెలల నుంచి తాగుడికి బానిసయ్యాడు. ఈ విషయంలో సుక్కన్న శనివారం రాత్రి 10 గంటల సమయంలో తన ఇంటి ఎదుట వేప చెట్టుకు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సుక్కన భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ దిగంబర్ తెలిపారు.

ఇటిక్యాలలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పెంబి, ఫిబ్రవరి 18 : మండలంలోని ఇటిక్యాల గ్రామంలో సీసీ రోడ్డు పనులను నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు స్వప్నిల్ రెడ్డి మాట్లాడుతూ పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. నాయకులు షమీ తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాలలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న నాయకులు

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 18 : ఖానాపూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం తెలంగాణ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కడారు సురేందర్ రెడ్డికి నిర్మల్ జిల్లా అధ్యక్షుడు కట్కం మురళి ఆదివారం వినతి పత్రం అందించారు. నిర్మల్‌లోని ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు సంబంధించిన ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన ఆయనకు వినతి పత్రం అందించారు. యాదయ్య, రమేశ్ గౌడ్, శ్రీ రాం, శంకరయ్య, రవి కుమార్, గంగాధర్, శంకర్, సంతోష్, అర్చన, సరిత, సంగీత, సూర్య సాగర్ తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677